# రాక్షసుడ్ని చంపాలంటే బ్రహ్మరాక్షసుడు రావాలి

'అన్ని ఎలిమెంట్స్ ఉన్న కమర్షియల్ ప్యాక్డ్ మూవీ 'భీమా'. ఈ సినిమాలో నా క్యారెక్టరైజేషన్ చాలా కొత్తగా ఉంటుంది' అన్నారు హీరో గోపీచంద్. ఆయన కథానాయకుడిగా రూపొందిన ఈ సినిమాకు ఎ.హర్ష దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మాత. ప్రియా భవానీశంకర్, మాళవికశర్మ కథానాయికలు. ఈ నెల 8న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా గోపీచంద్ విలేకరులతో ముచ్చటిస్తూ చెప్పిన సంగతులివి..



- 'రాక్షసుడ్ని చంపాలంటే బ్రహ్మరాక్షసుడు రావాలి.. ఈ కథ అదే నేపథ్యంలో సాగుతుంది. ఇందులోని సెమీ ఫాంటసీ ఎలిమెంట్‌ని దర్శకుడు చాలా గొప్పగా ఆవిష్కరించాడు. ప్రతి యాక్షన్ సీక్వెన్స్‌లో అద్భుతమైన ఎమోషన్ ఉంటుంది. అది అందరికీ నచ్చుతుంది
- కోవిడ్ టైమ్‌లో దర్శకుడు హర్ష ఓ పోలీస్ కథ చెప్పాడు. ఎందుకో ఆ కథకు కనెక్ట్ కాలేకపోయాను. ఇంకేదైనా కాప్ సబ్జెక్ట్ ఉంటే తీసుకురమ్మన్నాను. ఎనిమిది నెలల సమయం తీసుకుని ఈ కథ చెప్పాడు. కథ, కథలోని నా కేరక్టరైజేషన్, ఇందులో సెమీ ఫాంటసీ ఎలిమెంట్ నాకు చాలా నచ్చాయి. అలా 'భీమా' మొదలైంది.
- 'భీమా' పాత్రలో గొప్ప ఇంటెన్సిటీ ఉంటుంది. ప్రేమ, ఎమోషన్స్, రొమాన్స్ అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. సినిమా చూసి బయటికి వచ్చాక కూడా కథ మనల్ని వెంటాడుతుంది. అంతటి భావోద్వేగాలతో ఆకట్టుకుంటుంది. ఇక ప్రతి యాక్షన్ సీన్ రోమాంచితంగా అనిపిస్తుంది.
- గోలీమార్, ఆంధ్రుడు, శౌర్యం చిత్రాల్లో నేను పోలీస్ పాత్రల్ని పోషించాను. అయితే ఆ మూడింటికి పూర్తి భిన్నమైన పోలీస్ పాత్ర ఇది. పోలీస్ క్యారెక్టర్‌లోని సెమీ ఫాంటసీ ఎలిమెంట్స్ చాలా కొత్తగా అనిపిస్తాయి. నా కెరీర్‌లో 'భీమా' ఓ వైవిధ్యమైన చిత్రంగా నిలిచిపోతుందనే నమ్మకం ఉంది.
- హర్ష అనుభవం ఉన్న దర్శకుడిలా సినిమాను మలిచాడు. ఇందులో స్క్రీన్‌ప్లే గ్రిప్పింగ్‌గా ఉంటుంది. ఓ కొత్త అనుభూతిని ఇచ్చే సినిమా ఇది. ప్రచార చిత్రాలను చూసి ఈ సినిమాను అందరూ 'అఖండ'తో పోలుస్తున్నారు. నిజానికి 'అఖండ'కూ ఈ సినిమాకూ సంబంధం ఉండదు. పరశురామక్షేత్రం నేపథ్యంలో జరిగే కథ ఇది. ఏదేమైనా విడుదలకు ముందు 'అఖండ'తో పోల్చడం సినిమాకు లాభమే అనుకుంటున్నా (నవ్వుతూ).
- ఈ సినిమాలో హీరోయిన్ల పాత్రలు కథలో చాలా కీలకంగా ఉంటాయి. వాళ్ల పాత్రలకు ఓ పర్పస్ ఉంటుంది. సాంకేతికంగా అన్ని విధాలా సినిమా వండర్ అనిపించేలా ఉంటుంది. నా తదుపరి చిత్రాల గురించి చెప్పాలంటే..శ్రీను వైట్లతో చేస్తున్న సినిమా 30శాతం పూర్తయింది. తర్వాత ప్రసాద్‌గారితో ఓ సినిమా ఉంటుంది. యూవీ క్రియేషన్స్‌లో కూడా ఓ సినిమా ఉంటుంది.

# స్టాలిన్ దగ్గర డబ్బు తీసుకోలేదు



సోషల్ మీడియాలో తనపై వస్తున్న పుకార్లపై తీవ్ర స్థాయిలో స్పందించింది తమిళ సోయగం నివేదా పేతురాజ్. ఓ అమ్మాయి జీవితంతో ముడిపడి ఉన్న సమాచారాన్ని పోస్ట్ చేసే ముందు కాస్త మానవత్వంతో వ్యవహరించాలని, ఆ వార్తలు ఎంత వరకు ప్రామాణికమైనవో తెలుసుకోవాలని కోరింది. ఈ మేరకు ట్విట్టర్‌లో సుదీర్ఘమైన పోస్ట్ పెట్టిందీ అమ్మడు. నివేదా పేతురాజ్ ఈ స్థాయిలో రియాక్ట్ కావడానికి ఓ కారణముంది. తమిళనాడు సీఎం కుమారుడు ఉదయనిధి స్టాలిన్ ఈ భామకు 50కోట్ల రూపాయల విలువైన ఇంటిని బహుమతిగా ఇచ్చాడని సోషల్ మీడియాలో పుకార్లు బయలుదేరాయి. అంతటితో ఆగకుండా సీఎం కుమారుడిని నివేదా పేతురాజ్ డబ్బుల విషయంలో బాగా వాడుకుంటుందని ఆరోపిస్తూ యూ ట్యూబ్ వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ పుకార్లపై నివేదా పేతురాజ్ ట్విట్టర్ ద్వారా స్పష్టత నిచ్చింది. ఆ వార్తలన్నీ అవాస్తవాలని కొట్టిపారేసింది. 'నేను చాలా గౌరవ ప్రదమైన కుటుంబం నుంచి వచ్చాను. ఆర్థికంగా మాకు ఎలాంటి లోటు లేదు. నా కుటుంబం ఇప్పటికీ దుబాయ్‌లో నివసిస్తున్నది. నేను కాలేజీ రోజుల నుంచే సంపాదిస్తున్నా. ఇప్పటికీ ఇరవై సినిమాలు చేశాను. ఈ ప్రయాణంలో ఏ రోజూ డబ్బు గురించి ఆశపడలేదు. ఇకపై వార్తలు రాసేముందు ఓ అమ్మాయి గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని మానవత్వంతో వ్యవహరించాలని అభ్యర్థిస్తున్నా' అని నివేదా పేతురాజ్ పేర్కొంది.

# ఎనిమిది స్కెచ్‌లు రెడీ..



రాజమౌళి సినిమా అంటే ప్రీప్రొడక్షన్ పనులే ఎక్కువగా ఉంటాయి. ప్రతి విషయాన్నీ డీటైల్డ్‌గా రీసెర్చ్ చేసి, పాత్ర స్కెచ్‌లే కాదు, వాళ్లు వాడే ఆయుధాల స్కెచ్‌లూ, వాళ్ల కాస్ట్యూమ్స్‌కి సంబంధించిన స్కెచ్‌లూ, స్టోరీ బోర్డ్.. ఇలా ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అన్ని ఆయుధాలను సిద్ధం చేసుకొని, అన్ని అనుమానాలనూ నివృత్తి చేసుకొని పూర్తి క్లారిటీతో రంగంలోకి దిగుతారు రాజమౌళి. ఆయన వంద శాతం సక్సెస్‌లో ఉండటానికి కారణం అదే. ప్రస్తుతం మహేశ్‌తో చేయబోయే సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ చకచకా సాగుతున్నది. అమేజాన్ అడవుల నేపథ్యంలో సాగే ట్రెజర్ హంట్ మూవీగా ఈ చిత్రాన్ని రాజమౌళి తెరకెక్కిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. భారతీయ సినిమా చూడని కొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించబోతున్నారని ఇటీవలే విజయేంద్రప్రసాద్ మీడియాతో చెప్పారు. దానికి తగ్గట్టే స్క్రిప్ట్ దగ్గర్నుంచి, పాత్రధారుల గెటప్పుల వరకూ అన్నీ హాలీవుడ్ స్థాయిలో ఉండేలా రాజమౌళి చూసుకుంటున్నారని సమాచారం. ఇప్పటివరకూ వెండితెరపై కనిపించని కొత్త లుక్‌లో ఇందులో మహేశ్ కనిపించనున్నారట. ఈ లుక్‌కి సంబంధించిన ఎనిమిది స్కెచ్‌లను రాజమౌళి సిద్ధం చేశారట. ఆ లుక్స్‌తో త్వరలో మహేశ్‌కి టెస్ట్ ఫొటో షూట్ చేయనున్నారని తెలిసింది. అందులో ఒక లుక్‌ని ఖరారు చేస్తారు. తన సినిమాలకు సంబంధించిన వివరాలను రాజమౌళి ప్రెస్‌మీట్ పెట్టి మరీ ప్రకటిస్తుంటారు. మరి ఈ సినిమాకు సంబంధించిన ప్రెస్‌మీట్‌ని ఆయన ఎప్పుడు ఏర్పాటు చేసారా అని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# గామి గమ్యాన్ని చేరిన కథ



' నాకు హిమాలయాలు, మంచు, అక్కడ ప్రయాణం చాలా ఇష్టం. విఠలాచార్య లాంటి సాహసకథలంటే ఇష్టం. ఇవన్నీ కలిసి ఓ ఆలోచనగా మారాయి. ఈ ఆలోచనలకు నిజంగా జరిగిన ఓ సంఘటనను మిళితం చేసి తయారు చేసుకున్న కథే 'గామి' అన్నారు దర్శకుడు విద్యాధర్ కాగిత. విశ్వక్‌సేన్ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన ఈ చిత్రానికి కార్తీక్ శబరీశ్ నిర్మాత. చాందినీ చౌదరి కథానాయిక. ఈ నెల 8న మహాశివరాత్రి కానుకగా ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా విద్యాధర్ విలేకరులతో మాట్లాడారు. 'చిన్నగా మొదలై ఓ భారీ ప్రాజెక్ట్‌గా రూపాంతరం చెందింది 'గామి'. విశ్వక్‌సేన్‌కి ఏ ఇమేజ్ లేనప్పుడు ఒప్పుకున్న సినిమా ఇది. ఈ కథతో 5ఏళ్లు ప్రయాణం చేశాం. నేచర్ నుంచి కావాలనుకున్న దానికోసం ఏడాది పాటు ఆగి అనుకున్నది తీసుకున్నాం. 'అవతార్' పదేళ్లు తీశారు. దాన్ని ఆలస్యం అనకూడదు. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్నీ చేశాం. 'గామి' ఓ విజువల్ వండర్' అని చెప్పారు దర్శకుడు. గామి అంటే గమ్యాన్ని చేరేవాడు అని అర్థమని, హీరో గమ్యాన్ని ఎలా చేరాడు అనేది ఆసక్తికరంగా ఉంటుందని, తర్వాత ఏం జరుగబోతుందనే క్యూరియాసిటీ కలిగించే గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే ఈ సినిమాకు ప్రధానబలమని దర్శకుడు అన్నారు. యూవీ క్రియేషన్స్ వారు ఈ ప్రాజెక్టులోకి ఎంటరవ్వగానే ఫైనాన్షియల్‌గా మాకు ఫ్రీడమ్ వచ్చిందని, వనరులు పెరగడంతో క్వాలిటీకి ఎక్కడా తగ్గలేదని, సాంకేతికంగా వండర్ అనిపించే సినిమా ఇదని దర్శకుడు విద్యాధర్ పేర్కొన్నారు.

# ఓహ్ మేడమ్..



అల్లరి నరేష్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. మల్లి అంకం దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని 'ఓహ్ మేడమ్..' అనే తొలి గీతాన్ని మంగళవారం విడుదల చేశారు. గోపీసుందర్ స్వరపరచిన ఈ మెలోడీ గీతాన్ని భాస్కరభట్ల రచించారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. కథానాయకుడి మనసులోని ప్రేమ భావాల్ని ఆవిష్కరిస్తూ ఈ పాట అందంగా సాగింది. అల్లరి నరేష్, ఫరియా అబ్దుల్లా జోడి అందంగా కనిపించింది. వినోదాత్మకంగా సాగే ప్రేమకథా చిత్రమిదని, ఆద్యంతం నవ్వుల్ని పంచుతుందని చిత్ర బృందం పేర్కొంది. మార్చి 22న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. వెన్నెల కిషోర్, వైవా హర్ష, అరియానా గ్లోరీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సూర్య, సంగీతం: గోపీసుందర్, సహనిర్మాత: భరత్ లక్ష్మీపతి, దర్శకత్వం: మల్లి అంకం.

# దీపికా తెలుగు డబ్బింగ్?



'కల్కి 2898 ఏడీ' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమవుతున్నది మంగళూరు సోయగం దీపికా పడుకోన్. నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ మూవీ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ప్రస్తుతం ఇటలీలో ఓ పాట చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమాలో దీపికా పడుకోన్ పద్మ అనే పాత్రలో నటిస్తున్నదని, కథాగమనంలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే దీపికా పడుకోన్ పాత్ర తాలూకు షూటింగ్ మొత్తం పూర్తయిందని తెలిసింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా కోసం తెలుగులో సొంతంగా డబ్బింగ్ చెప్పే ప్రయత్నాల్లో ఉందట దీపికా పడుకోన్. దక్షిణాది అమ్మాయి కావడంతో తెలుగును అర్థం చేసుకొని డబ్బింగ్ చెప్పడం అంత కష్టమైన విషమేమి కాదని, ఓన్ డబ్బింగ్ వల్ల పాత్రలోని ఉద్వేగాలు మరింత బలంగా కనిపిస్తాయనే ఆలోచనలో ఉందట దీపికా పడుకోన్. అందుకోసం ఈ అమ్మడు ప్రస్తుతం తెలుగు భాషపై పట్టు సాధించే ప్రయత్నాల్లో ఉందట. అయితే వాయిస్ టెస్ట్ అనంతరం డబ్బింగ్ విషయంలో చిత్ర బృందం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. 'కల్కి 2898' చిత్రం మే 9న ప్రేక్షకుల ముందుకురానుంది.

# భాస్కర్‌తో సుమతి ప్రయాణం



దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. ముంబయి నేపథ్యంలో 80వ దశకం నాటి ప్రేమకథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఓ సాధారణ వ్యక్తి యొక్క అసాధారణ ప్రయాణమే ఈ చిత్ర కథాంశం. మంగళవారం కథానాయిక మీనాక్షి చౌదరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సుమతి పాత్రలో ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఓ భవంతి ముందు కూర్చొని దీర్ఘాలోచనలో ఉన్న ఆమె లుక్ ఆకట్టుకునేలా ఉంది. హృదయాన్ని స్పృశించే ప్రేమకథా చిత్రమిదని, అభినయ ప్రధానంగా సుమతి పాత్ర సాగుతుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిమిష్ రవి, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, రచన-దర్శకత్వం: వెంకీ అట్లూరి.

# వార్నర్ బ్రదర్స్ కంటే గొప్ప సినిమాలు తీస్తా



' తెనాలిలో మాది చిన్న కలప వ్యాపారం. నేను నిద్రలో కూడా సినిమాలనే కలవరిస్తాను. అందుకే ఊరు వదిలి హైదరాబాద్ చేరుకున్నాం. సినీ కళామతల్లి వల్ల నిలదొక్కుకున్నాం.' అన్నారు దర్శక, నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు. ఆయన దర్శకత్వంలో చదలవాడ పద్మావతి నిర్మించిన 'రికార్డ్‌బ్రేక్' చిత్రం మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు చదలవాడ. 'కంటెంట్ ఉన్న సినిమాకు కచ్చితంగా ఆదరణ ఉంటుందని 'బిచ్చగాడు' తెలియజెప్పింది. అందుకే.. ప్రేక్షకుల మనసులకి హత్తుకునేలా నిజానికి దగ్గరగా 'రికార్డ్‌బ్రేక్' తీశాను. 'తల్లి కోసం బిడ్డ కష్టం 'బిచ్చగాడు'. బిడ్డలకోసం తల్లి పడే కష్టం ఈ 'రికార్డ్ బ్రేక్'' అని తెలిపారు చదలవాడ శ్రీనివాసరావు. విజయ నాగిరెడ్డి, రాజశ్రీ ప్రొడక్షన్స్ వారి ఇన్‌పుట్స్ తీసుకుని సినిమా నిడివిని 20 నిమిషాలు తగ్గించామని, అలా చేయడంతో సినిమా మరింత క్వాలిటీగా తయారైందని ఆయన చెప్పారు. ఈ సినిమా సక్సెస్ తర్వాత మంచి టెక్నికల్ వాల్యూస్‌తో వార్నర్ బ్రదర్స్ తీసే సినిమాల కంటే గొప్ప సినిమాలు తీసి చూపిస్తానని చదలవాడ శ్రీనివాసరావు అన్నారు.



# విభిన్న ప్రేమకథ 'లవ్ మౌళి'

నవదీప్, పంఖురి గిద్వానీ జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకుడు. నైరా క్రియేషన్స్ శ్రీకర స్టూడియోస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ సినిమాలోని 'షీ ఈజ్ రియల్' అనే లిరికల్ వీడియోను మంగళవారం విడుదల చేశారు. గోవింద్ వసంత్ స్వరాలు అందించిన ఈ చిత్రానికి అనంత్‌శ్రీరామ్ సాహిత్యాన్నందించారు. శరత్ సంతోష్, జిబా టామీ ఆలపించారు. దర్శకుడు మాట్లాడుతూ 'డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. నా జీవితంలో జరిగిన సంఘటనల స్ఫూర్తితో కథ రాసుకున్నా. నవదీప్ పాత్ర కొత్త పంథాలో ఉంటుంది. ప్రేమలోని భిన్న కోణాన్ని ఆవిష్కరిస్తూ కథ సాగుతుంది' అన్నారు. ఈ చిత్రానికి నిర్మాణం: సి స్పేస్, రచన-దర్శకత్వం, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్: అవనీంద్ర.

# క్రైమ్ నేపథ్యంలోసాగే థ్రిల్లర్



రవితేజ నున్నా, నేహా జురెల్ జంటగా నటించిన చిత్రం 'రాజుగారి అమ్మాయి-నాయుడుగారి అబ్బాయి'. సత్యరాజ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ ముత్యాల రామదాసు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 9న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో రవితేజ నున్నా, దర్శకుడు సత్యరాజ్ విలేకరులతో ముచ్చటించారు. 'ఈ కథలో హీరోయిన్ అనుమానాస్పదంగా చనిపోతుంది. ఆమె చివరిగా కలిసింది హీరోనే. దాంతో హీరోకీ, ఈ హత్యకూ ఏమైనా సంబంధం ఉందా? ఆమెను ఎవరు హత్య చేశారు? అనే ప్రశ్నల చుట్టూ ఈ కథ నడుస్తుంది' అని హీరో రవితేజ నున్నా చెప్పారు. నిర్మాత ముత్యాల రాందాసు, పీఆర్‌వో వేణుగోపాల్ ఈ సినిమాకు రెండు కళ్లని, వారి వల్లే ఇంతదూరం ప్రయాణించగలిగామని దర్శకుడు చెప్పారు. మొదట సతీశ్ అనే నిర్మాతతో తక్కువ బడ్జెట్‌లో సినిమా మొదలుపెట్టామని, సినిమా బాగా వస్తుండటంతో ఎవరైనా సపోర్ట్ చేస్తే బావుండని ముత్యాల రాందాసు కలిశామని, ఈ ప్రాజెక్ట్‌లోకి ఆయన ఎంటర్ అయ్యాక సినిమా స్వరూపమే మారిపోయిందని, మంచి ఆర్టిస్టులు, గొప్ప టెక్నీషియన్స్ వచ్చి చేరారని దర్శకుడు చెప్పారు. హీరో నటన విషయంలో నూటికి నూరు శాతం సంతృప్తితో ఉన్నానని, అలాగే, పాటలు తమన్ స్థాయిలో, నేపథ్య సంగీతం మణిశర్మ స్థాయిలో అద్భుతమైన సంగీతాన్ని రోషన్ సాలూరి అందించారని దర్శకుడు తెలిపారు. ఇది క్రైమ్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ ప్రేమకథ అని, వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ కథ తయారు చేసుకున్నానని ఆయన అన్నారు. కంటెంట్ ఉన్న థ్రిల్లర్ సినిమాను ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారనీ, ఈ సినిమాలో కంటెంటే ప్రధానమనీ, దర్శకుడు సత్య మొదట పాటలు వినిపించి, తర్వాత కథ చెప్పాడనీ, ఆ కథ నచ్చి వెంటనే అంగీకరించానని, నటనపై ఇష్టంతో ఈ రంగంలోకి అడుగుపెట్టాననీ, నాకు మంచి పేరు తెచ్చే సినిమా అవుతుందని హీరో రవితేజ నున్నా తెలిపారు.

